క్లుప్తంగా

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు జిల్లావ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు, నేర చరిత్రగల వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తప్పనిసరిగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

కంప చెట్లను తొలగించండి



విద్యుత్ తీగలను తాకుతున్న ఫారం చెట్టు కొమ్మలు

ఓర్వకల్లు: ప్రమాదకరంగా మారిన కంప చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. మండల కేంద్రమైన ఓర్వకల్లులో ఓ ఖాళీ స్థలంలో కంప చెట్లు విద్యుత్ తీగల వరకు పెరిగి ప్రమాదకరంగా మారిన దృశ్యం స్థానిక పెండేకంటి నగర్‌లో దర్శనమిస్తుంది. కాలనీలోని మర్రిచెట్టు లైన్‌లో ఖాళీ స్థలంలో విపరీతంగా గడ్డి మొలిచి బందెరదొడ్డిని తలపిస్తోంది. ఈ స్థలంలోనే ఓ ఫారం చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలకు చుట్టుకోవడంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం జనసంచారం ఉండే ఈ ప్రాంతంలో పెరిగిన గడ్డితో విష సర్పాలకు స్థావరంగా మారింది. అధికారులు స్పందించి ఫారం చెట్టు, గడ్డిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్లాట్లను క్రమబద్ధీకరించుకోండి

కర్నూలు (టౌన్): అనధికార లే ఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని అర్హులైన వారు వినియోగించుకోవాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి సంబంధించి కొన్ని సవరణలు చేస్తూ ప్రభుత్వం జీఓ 134 జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 30కి ముందు ఏర్పాటైన అనధికార లేఔట్లు, ప్లాట్ల ను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందన్నారు. ఇందుకు అక్టోబర్ 24వ తేదీ లోపు రూ.10 వేలు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూ చించారు. కార్పొరేషన్ సిబ్బంది తనిఖీ చేసి ధ్రువీకరించిన తర్వాత మార్కెట్ విలువలో 14 శాతం అపరాధ రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. 45 రోజుల్లోపు పూర్తి రుసుం చెల్లించిన వారికి 10 శాతం రాయితీ, 45 నుంచి 90 రోజుల వ్యవధిలో చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. గడువులోపు క్రమబద్ధీకరించుకోని అనధికార లేఔట్లు, ప్లాట్లకు విద్యుత్ సౌకర్యం, నీటి సరఫరా, డ్రైనేజీ వంటి సదుపాయాలకు అనుమతి ఉండదని వెల్లడించారు. వివరాలకు నగరపాలక కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగాన్ని సంప్రదించాలని లేదా 77807 15803 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించా రు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు ఆయన వివరించారు.

అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 నంబర్

పీజీఆర్ఎస్‌లో సమర్పించిన అర్జీలు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అలాగే meekosam.ap. gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

నేడు నగరపాలకలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు ఏవైనా సమస్యలుంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

కల్లూరు: రైతులకు మెరుగైన సేవలు అందించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఉలిందకొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా ఈవీ రమణ, డైరెక్టర్ల ప్రయాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. పార్టీలో కష్టపడిన వారికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయన్నారు. టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి, మల్లెల రాజశేఖర్,ధర్మవరం సుబ్బారెడ్డి, గౌరు జనార్దన్ రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

నిధులు పాతవి.. పనులు కొత్తవి!

- ప్రజల కోసం ఒక్కపైసా విదల్చని కూటమి ప్రభుత్వం
- తాగునీటి కోసం రూ.6.20 కోట్లు విడుదల చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఒక్కో గ్రామంలో రూ.10 లక్షలతో పైపులైన్ పనులు
- ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయిన మంచినీటి ట్యాంకుల నిర్మాణం
- కూటమి అధికారం చేపట్టి ఏడాది దాటినా పూర్తికాని పనులు

ఓర్వకల్లు: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కష్టాలను అరికట్టాలనే సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంచినీటి పథకాలకు పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టింది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జలజీవన్ మిషన్ పథకాన్ని ఉపయోగించడంతో మంచి నీటి పథకాలు మరింత విస్తృతం దాల్చాయి. ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇవ్వాలన్నదే లక్ష్యంగా పనులు చేపట్టారు. కాగా, చివరి దశలో సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో ట్యాంకుల నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. నిలిచిపోయిన పనులను పూర్తిచేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. ఈ నేపథ్యంలో పాత నిధులతో ఏడాది తర్వాత కొత్తగా పనులు చేపడుతున్నారు.

గత ప్రభుత్వంలో రూ.6.20 కోట్లు మంజూరు

గ్రామ జనాభా ప్రాతిపదికన, నీటి సమస్య తీవ్రతను బట్టి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మండలంలోని ఓర్వకల్లు, శకునాల, బ్రాహ్మణపల్లె, తిప్పాయపల్లె, కాల్వ, కన్నమడకల, గుట్టపాడు, ఎస్.కొంతలపాడు, కేతవరం, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు గ్రామాలకు కలిపి జలజీవన్ మిషన్ కింద రూ.6.20 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులను దశల వారీగా ఖర్చు చేసి సమస్య పరిష్కరించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ నేపథ్యంలో ఒక్కో గ్రామంలో రూ.10 లక్షల చొప్పున ఖర్చుపెట్టి పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. అలాగే తిప్పాయపల్లె, గుట్టపాడు, ఉప్పలపాడు, బ్రాహ్మణపల్లె, ఎస్.కొంతలపాడు గ్రామాల్లో పైపులైన్‌తో పాటు, మంచినీటి ట్యాంకుల మేజర్ నిర్మాణ పనులను పూర్తిచేయగా, ప్రస్తుతం మైనర్ నిర్మాణ పనులు ఈ మధ్య కాలంలోనే పూర్తయినట్లు తెలుస్తోంది. వీటికి సుమారు రూ.2 కోట్ల నిధులు ఖర్చుపెట్టారు. మిగతా రూ.4.20 కోట్ల నిధులతో ఆయా గ్రామాలలో పనులు మొదలు పెట్టేలోగ సార్వత్రిక ఎన్నికలు సమీపంచడంతో పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో మిగిలిపోయిన నిధులతోనే కూటమి పాలకులు మంచినీటి ట్యాంకుల నిర్మాణ పనులు చేపడుతున్నారు.

పనుల పురోగతి ఇలా..

మండలంలోని శకునాల గ్రామంలో రూ.12 లక్షలతో పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా ఇంతవరకు పనులు మొదలు పెట్టలేదు. ఉయ్యాలవాడకు రూ.70 లక్షలు కేటాయించగా అందులో రూ.10 లక్షలతో పైపులైన్ పనులు పూర్తికాగా, మిగతా రూ.60 లక్షలతో 90 లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఉప్పలపాడులో రూ.62 లక్షలతో పైపులైన్, 90 లీటర్ల సామర్థ్యంతో మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి చేశారు. లొద్దిపల్లెలో రూ.36 లక్షలతో చేపట్టిన పైపులైన్ నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. అధిక జనాభా కలిగిన ఓర్వకల్లుకు రూ.91 లక్షలు మంజూరుకాగా, ఇందులో ఇప్పటికే పైపులైన్ నిర్మాణం కోసం రూ.30 లక్షలు ఖర్చుచేయగా, మిగతా రూ.61 లక్షలతో 90 వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంకు అవసరం కాగా, కేవలం 60 వేల లీటర్ల ట్యాంకును నిర్మిస్తుండడంతో ఆ నీరు గ్రామ జనాభాకు ఏ మాత్రం సరిపోదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓర్వకల్లు కంటే జనాభా తక్కువగా ఉన్న ఉప్పలపాడులోనే 90 లీటర్ల ట్యాంకును నిర్మిస్తే, ఓర్వకల్లులో 60 లీటర్ల ట్యాంకును నిర్మించడం చర్చనీయాంశంగా మారింది. ఇకపోతే ఎస్.కొంతలపాడుకు రూ.40 లక్షలు, కన్నమడకలకు రూ.62 లక్షలు, కాల్వ గ్రామానికి రూ.1.09 కోట్లు, తిప్పాయపల్లెకు రూ.62 లక్షలు, కేతవరానికి రూ.60 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు అధికారులు పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన నిధులతోనే కూటమి నాయకులు నిర్మాణ పనులు చేపడుతుండడం గమనార్హం.



ఉప్పలపాడులో నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంకు



ఓర్వకల్లులో చివరి దశకు చేరిన ట్యాంకు నిర్మాణం

లక్ష్యం 'నీరు'గారుస్తున్నారు

గత ప్రభుత్వం జనాభా ప్రాతిపధికన మంచినీటి పథకాలకు నిధులు కేటాయిస్తే, సొంత డబ్బులు పెట్టి నిర్మాణ పనులు చేపడితే ఆ నిధులు రావనే ఉద్దేశంతో పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంతవరకు కేవలం ఓర్వకల్లు, కేతవరం గ్రామాలలో మాత్రం ట్యాంకు నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి. శకునాల గ్రామంలో కేవలం రూ.12 లక్షలతో పైపులైన్ నిర్మాణ పనులు చేట్టాపట్టాల్సి ఉంది, ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, కాల్వ, కన్నమడకల గ్రామాలలో ఇంకా పనులు మొదలు పెట్టకపోవడం గమనార్హం. ఆయా గ్రామాల్లో పనులు చేపట్టేందుకు ఎవరూ సాహసించడం లేదని తెలుస్తోంది.

గ్రంథాలయాలతో విజ్ఞానం

కర్నూలు(రూరల్): దేశ భవిష్యత్తు యువతపై ఆధరపడి ఉందని డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క అన్నారు. తాండ్రపాడు గ్రామంలో సర్పంచ్ బాల పీర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత కాంపిటీషన్ పుస్తకాలు చదవడంతో పాటు విజ్ఞానం పెంచుకోవాలన్నారు. గ్రామాల నుంచి అనేక మంది ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు అయ్యారని వివరించారు. ప్రస్తుతం యువత మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు బానిసై భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని వాపోయారు. యువత ప్రతి రోజు వీలున్నప్పుడు గ్రాంథాలయాన్ని సందర్శించడం అలవాటు చేసుకుంటే చెడు అలవాట్లపై దృష్టి మళ్లదని చెప్పారు. గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేసిన సర్పంచ్‌ను పలువురు అభినందించారు. గ్రామస్తులు, సీపీఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు గౌరవ వేతనం రెట్టింపు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు గౌరవ వేతనాన్ని పెంచుతూ ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో బీఎల్‌ఓలు (బూత్ లెవల్ ఆఫీసర్), బీఎల్‌ఓ సూపర్‌వైజర్లకు మాత్రమే గౌరవ వేతనం ఇచ్చేవారు. ప్రస్తుతం ఈఆర్‌ఓలు (ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్), ఏఈఆర్‌ఓలకు కూడా గౌరవ వేతనం నిర్ధారించింది. 2015 నుంచి బూత్ లెవల్ ఆఫీసర్లకు ఏడాదికి రూ.6 వేల గౌరవ వేతనాన్ని ఇస్తూ వస్తున్నారు. ప్రస్తుతం దానిని రెట్టింపు అంటే రూ.12 వేలు చేశారు. అలాగే ఎలక్ట్రోరోల్ సమయంలో ఇచ్చే ఇన్సెంటివ్‌ను రూ.వెయ్యి నుంచి రూ.2 వేలకు పెంచారు. ఇక బూత్ లెవల్ ఆఫీసర్ సూపర్ వైజర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని కూడా రూ.12 వేల నుంచి రూ.18 వేలకు పెంచారు. ఇక గతంలో ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలకు ఎలాంటి గౌరవ వేతనం ఇచ్చేవారు కాదు. ఇక నుంచి ఏఈఆర్‌ఓలకు రూ.25 వేలు, ఈఆర్‌ఓలకు రూ.30 వేలు ఇస్తారు. కాగా, బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు ఇచ్చే గౌరవ వేతనాన్ని నాలుగు త్రైమాసికల్లో చెల్లిస్తారు.

పిల్లలను చూసేందుకు తల్లిదండ్రులకు ఆంక్షలు

- మండుటెండలో ఇబ్బంది పడిన తల్లిదండ్రులు
- కస్తూర్బా పాఠశాల వద్ద ఘటన



గేటు బయట వేచి ఉన్న తల్లిదండ్రులు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాల్లో చదువుకుంటున్న తమ పిల్లలను చూసేందుకు తల్లిందండ్రులను అనుమతించకపోవడంతో అవస్థలు పడ్డారు. ఆదివారం వివిధ గ్రామాల నుంచి తల్లిందండ్రులు పిల్లలను చూసేందుకు ఉదయం 11 గంటలకు పాఠశాల వద్దకు చేరుకున్నారు. అయితే పాఠశాల గేటు తెరవకపోవడంతో తల్లిందండ్రులు బయటే గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఎండల తీవ్రతతో వారు అల్లాడిపోయారు. ఎంత బతిమాలుకున్నా పిల్లలను చూసేందుకు అనుమతించలేదు. చేసేది లేక తల్లిదండ్రులు నిస్సహాయులుగా ఉండిపోయారు. ప్రధాన గేటు బయటే మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఘటనపై తల్లిదండ్రులు ఎంఈఓ-2 సుబ్రమణ్యంకు ఫిర్యాదు చేశారు. తమకు ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా తీరా వచ్చాక ప్రతి నెలా రెండోవారం మాత్రమే అనుమతిస్తామని చెప్పడం సరికాదన్నారు. ఆరబయట ఎండలో తాగేందుకు నీళ్ల లేవని వాపోయారు. ఈ విషయంపై ఎస్‌ఓ శోభరాణిని వివరణ కోరగా.. రెసిడెన్సియల్ పాఠశాలలో నెలలో రెండో వారం మాత్రమే తల్లిదండ్రులు వచ్చేందుకు అనుమతి ఉందని, అయితే స్టడీ అవర్ ఉన్నందున పిల్లలను చూసేందుకు అనుమతించలేదన్నారు. తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి రెండో వారం వచ్చేలా అవగాహన కల్పిస్తామన్నారు.

క్రెడాయ్ సామాజిక బాధ్యత అభినందనీయం



ఎంఓయూలపై సంతకాలు చేస్తున్న కమిషనర్, క్రెడాయ్ సంస్థ సభ్యులు

కర్నూలు (టౌన్): కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) సామాజిక బాధ్యతగా చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. ఆదివారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో.. పాతబస్తీలోని గడియారం ఆసుపత్రి నిర్వహణ బాధ్యతలను క్రెడాయ్ సంస్థకు బదలాయింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేశారు. కమిషనర్, క్రెడాయ్ సంస్థ జిల్లా చైర్మన్ గోరంట్ల రమణ ఎంఓయూలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పాతబస్తీలో దశాబ్దాల చరిత్ర కలిగిన గడియారం ఆసుపత్రికి పూర్వ వైభవం తెచ్చేందుకు స్వచ్ఛందంగా, సామాజిక బాధ్యతగా క్రెడాయ్ సంస్థ ముందుకొచ్చిందన్నారు. క్రెడాయ్ సంస్థ జిల్లా చైర్మన్ మాట్లాడుతూ.. ముందుగా రూ.20 లక్షలతో ఆధునికీకరణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, క్రెడాయ్ సభ్యులు పాల్గొన్నారు.

అవయవదానంతో పునర్జన్మ



ర్యాలీలో పాల్గొన్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైద్యులు, సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): అవయవదానం వల్ల కొన్ని కుటుంబాల్లో వెలుగు నింపవచ్చని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. 15వ జాతీయ అవయవదాన దినోత్సవం పురస్కరించుకుని అంగ్‌దాన్ జీవన్ సంజీవని అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వైద్య విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అవయవదానం కోసం ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్టర్ చేసుకుని ముందుకు రావాలన్నారు. మనిషి మరణించిన తర్వాత అతని అవయవాలను అవసరమైన వారికి అమరిస్తే పునర్జన్మ ప్రసాదించినట్లు అవుతుందన్నారు. ఓ వ్యక్తి నుంచి అవయవాలు సేకరించడం వల్ల 8 మంది జీవితాల్లో వెలుగు నింపవచ్చని చెప్పారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, వైద్యాధికారులు ముత్యశ్రీ, వెంకట పక్కిరెడ్డి, శివబాల నాగాంజన్, కిరణ్‌కుమార్, సునీల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

వీహెచ్‌పీ జిల్లా సమావేశం

కల్లూరు: స్థానిక ఆదిత్య హైస్కూల్లో ఆదివారం విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖండ భారత్ సంకల్ప దివస్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య వక్త దక్షిణాంధ్ర ప్రాంత ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకటరామయ్య కరపత్రాన్ని ఆవిష్కరించారు. జిల్లాలో పెద్దఎత్తున కార్యకర్తల సమక్షంలో సంకల్ప దివస్ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షులు గోవిందరాజులు మాట్లాడుతూ.. హైందవ శంఖారావం సభలో శ్రీ చిన్నజీయర్ స్వామి ఆలయాల విముక్తి కొరకై ప్రతిజ్ఞ చేయించిన డిక్లరేషన్‌ను జిల్లా సమావేశంలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీసీ మద్దిలేటి, వాసుదేవయ్య, గోరంట్ల రమణ, స్వత్మానంద స్వామి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రమోషన్ ఇవ్వాలి

కల్లూరు: దివ్యాంగ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి - 2016 చట్టం ప్రకారం పనిచేసే చోటనే నియమించాలని జిల్లా దివ్యాంగ ఉద్యోగుల సంఘం నాయకులు కె.కృష్ణుడు, కె.కృష్ణా కోరారు. దివ్యాంగ ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే (దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్) గౌరు చరితారెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రమిచ్చారు. వారు మాట్లాడుతూ దివ్యాంగ ఉద్యోగులకు పట్టణ ప్రాంతానికి దగ్గర్లోని ప్రభుత్వ స్థలాన్ని మార్కెట్ వాల్యూ ప్రకారం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి తక్కువ వడ్డీకి రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరాముడు, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవన విధానం అలవడుతుందని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఉత్పన్నమయ్యే అనేక సమస్యలకు భగవద్గీతలో పరిష్కారం దొరుకుతుందన్నారు. వైదిక ధర్మం, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. అనంతరం శీల ప్రభు పాదుల ప్రేమ విందు జరిగింది. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మద్యం విక్రయాలు



మద్యం షాపు పక్కనే బెల్టు షాపు నిర్వహిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లులో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. గ్రామంలో ఓర్వకల్లు నుంచి నందికొట్కూరుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన, స్థానిక మర్రిచెట్టు సమీపంలో రవి వైన్స్ పేరిట కొందరు వ్యక్తులు సిండికేట్‌గా మద్యం షాపును నిర్వహిస్తున్నారు. ఈ షాపులో నిబంధనలకు విరుద్ధంగా మందుబాబులకు సిట్టింగ్ ఏర్పాటు చేయడమే గాక మద్యం షాపు పక్కనే ఓ బంకు పెట్టి అందులో వాటర్ బాటిళ్లు, గ్లాసులు, స్నాక్స్ వంటివి విక్రయిస్తున్నారు. దీంతో మందుబాబులు అక్కడే మకాం వేసి, పూటుగా మద్యం సేవించి, బయటకు వచ్చి రోడ్డుపైనే మూత్ర విసర్జన చేయడంతో అటుగా వెళ్లే మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అంతేగాక, మద్యం షాపు నుంచి స్థానికంగా వాటర్ షాపులతో పాటు, కన్నమడకల, గుట్టపాడు, తిప్పాయపల్లె, శకునాల, బ్రాహ్మణపల్లె, చౌట్కూరు గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులకు యథేచ్ఛగా అక్రమ మద్యం సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా స్థానిక పోలీసులు మామూళ్లు తీసుకొని పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమ మద్యం వ్యాపారాన్ని అరికట్టాలని, లేదంటే మద్యం షాపును జనావాసాలకు మధ్య గాకుండా ఊరు బయటకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపక్కనే వ్యర్థాలు



కొత్తూరు వద్ద రోడ్డు పక్కనే చెత్తను పారవేసిన దృశ్యం

పాణ్యం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీ వల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయానికి రాష్ట్రంనుంచే గాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వస్తుంటారు. ఆది, మంగళ వారాల్లో భక్తుల రద్దీ మరింత అధికంగా ఉంటుంది. భక్తులు స్వామివారికి అభిషేకాలు చేసిన అనంతరం మిగిలిన పాలు, తెనె సీసాలు, టెంకాయ ముక్కలు, అగరుబత్తుల ప్యాకెట్లు, పాలు, పెరుగు ప్లాస్టిక్ వ్యర్థాలను ఆలయ అధికారులు అనుపూరు రోడ్డు పక్కనే పడేస్తున్నారు. అవి కుళ్లిపోయి రోడ్డున వెళ్లే భక్తులు, వాహనదారులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అభిషేకం అనంతరం వీటిని ప్రత్యేక స్థలంలో వేసేవారు. దీంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం అధికారులు అన్ని రకాల వ్యర్థాలను రోడ్డుపక్కనే పారబోస్తున్నారు. దీంతో ఇబ్బందులు ఏర్పడుతున్నారు. భక్తులు ఎంతో పవిత్రంగా స్వామి వారికి సమర్పించిన తర్వాత మిగిలిన వ్యర్థాలను ప్రత్యేక స్థలంలో వేయాలని భక్తులు కోరుతున్నారు.

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉత్తర్వులు



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పాఠశాలల్లోకి రాజకీయ నాయకులు, విద్యార్థి సంఘాలు వెళ్లరాదని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, ఎస్.షాబీర్‌బాషా మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తున్నామని, తక్షణమే ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు విద్యార్థుల సమస్యల పరిష్కారం, హక్కుల కోసం పోరాడేందుకు పాఠశాలల్లోకి వెళ్తుంటారన్నారు. ఈ క్రమంలో విద్యార్థి సంఘాలపై నిషేధం విధిండం అన్యాయమన్నారు. దీనిని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని కోరారు. ప్రధానంగా చైతన్య, నారాయణ, భాష్యం విద్యాసంస్థలు కూటమి నేతలకు చెందినవి కావడంతో వాటిలో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను పీడిస్తున్నారని, వారిని ప్రశ్నించేందుకు ఎవరూ వెళ్లకూడదన్న నిర్ణయంతో ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, అభిరామ్, దీపిక, రియా, మధు, బన్నీ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



పూలబజార్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగరంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. ఆదివారం రాత్రి నగరంలో చేపడుతున్న స్వచ్ఛత పనులను కమిషనర్ తనిఖీలు నిర్వహించారు. స్థానికంగా పూలబజార్, పాత ఈద్గా, బళ్లారి చౌరస్తా ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రధాన రహదారుల్లో రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు స్వచ్ఛత పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డును బాగు చేయరూ!



ఎమ్మిగనూరు రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

కోడుమూరు రూరల్: కోడుమూరు – ఎమ్మిగనూరు రోడ్డులో మండల పరిషత్ కార్యాలయ సమీపంలో నడిరోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు సకాలంలో గుంతలను పూడ్చకపోవడంతో అవి మరింత పెద్దగా మారి వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారాయి. పగటి వేళలో వాహనదారులు ఎలాగోలా గుంతలను గమనించి జాగ్రత్త పడుతున్నా రాత్రి వేళల్లో గుంతలను గమనించకుండా వెళ్లి ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చి రోడ్డును బాగు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.





జొహరాపురం - వెంకయపల్లె రోడ్డు దుస్థితి

రహ'దారి'ద్య్రం

ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యాలు గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోడ్లవి కాదు. నగర పరిధిలోని జొహరాపురం రోడ్డు దుస్థితి ఇదీ. కర్నూలు నగరంలోని జొహరాపురం నుంచి వెంకాయపల్లె, పుల్లయ్య కళాశాలతో పాటు వివిధ కాలనీలకు చెందిన వారు నిత్యం ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటారు. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. ఎదురుగా వాహనం వస్తే భయం భయంగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని, అలాగే రోడ్డు ఎత్తులో ఉండడంతో సైడ్లకు కంచె నిర్మించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

– కల్లూరు